నియామకం



జల్లపల్లి నరేందర్

శంషాబాద్: అఖిల భారతీయ సపాయికామ్ గార్ సంఘటన్ జాతీయ ఉపాధ్యక్షుడిగా పీసీసీ ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు జల్లపల్లి నరేందర్ నియమితులయ్యారు. ఈ మేరకు జాతీయ అధ్యక్షుడు విజయ్‌కుమార్ ఢిల్లీలో ఆయనకు నియామకపత్రాన్ని అందజేశారు. సపాయి కామ్‌గార్ సంఘటన్ ఇచ్చిన బాధ్యతలతో వారి హక్కుల పరిరక్షణ, సంక్షేమం కోసం పని చేస్తానని ఈ సందర్భంగా నరేందర్ పేర్కొన్నారు. తనకు పదవి ఇచ్చిన జాతీయ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

జనరంజకంగా కాంగ్రెస్ పాలన



సీఎంని కలిసిన శ్రీనివాస్‌గౌడ్

మైలార్‌దేవ్‌పల్లి: తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వ పాలన జనరంజకంగా కొనసాగుతోందని టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి సానెం శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. రాష్ట్ర కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించినందున ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని శనివారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించడం ఆనందంగా ఉందన్నారు. ఈ పదవి తనపై మరింత బాధ్యత పెంచిందని పార్టీ బలోపేతానికి మరింత కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు.

నేడు నార్సింగిలో 5కే రన్

మణికొండ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న వంద రోజుల ప్రణాళికలో భాగంగా ఆదివారం నార్సింగి మున్సిపాలిటీలో 5కే రన్ నిర్వహించనున్నట్లు కమిషనర్ టి.కృష్ణమోహన్‌రెడ్డి తెలిపారు. ఉదయం 6 గంటలకు మెలుహ ఇంటర్నేషనల్ స్కూల్ నుంచి ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్, మున్సిపల్ శాఖ రాష్ట్ర ముఖ్య కార్యదర్శి టి.కె. శ్రీదేవి హాజరవుతారన్నారు. అన్ని పార్టీల నాయకులు, ఎన్జీఓలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

హెడ్‌కానిస్టేబుల్ విజయ్ కుటుంబానికి రూ. 15 లక్షల సాయం



విజయ్ కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

శంషాబాద్ రూరల్: విధి నిర్వహణలో ఉంటూ రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందిన హెడ్ కానిస్టేబుల్ విజయ్‌కుమార్ కుటుంబానికి తన సహచర సిబ్బంది శనివారం ఆర్థిక సాయం అందజేశారు. వివరాలివీ... శంషాబాద్ పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేసే విజయ్‌కుమార్ మే 25న ప్రమాదానికి గురై మృతి చెందారు. ఈ నేపథ్యంలో శంషాబాద్ జోన్ పోలీస్ సిబ్బంది రూ. 15 లక్షలను సేకరించారు. ఆ మొత్తాన్ని విజయ్ కుటుంబ సభ్యులకు డీసీపీ రాజేశ్ చేతుల మీదుగా అందజేశారు. అడిషనల్ డీసీపీ పూర్ణచంద్ర, ఏసీపీ శ్రీకాంత్‌గౌడ్, షాద్‌నగర్ ఏసీపీ లక్ష్మీనారాయణ, ఇన్‌స్పెక్టర్లు కె.నరేందర్‌రెడ్డి, బాలరాజు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రమోద్, సిబ్బంది పాల్గొన్నారు.

బోనాల నిర్వహణకు అధిక నిధులు కేటాయించాలి

చార్మినార్: ఆషాఢ మాసం బోనాల జాతర ఉత్సవాలను పురస్కరించుకుని దూద్ బౌలి మహారాజ్ గంజ్‌లోని పోచమ్మ ఆలయానికి అధిక నిధులు కేటాయించాలని బహదూర్‌పురా నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి పులిపాటి రాజేశ్ కుమార్ కోరారు. ఈమేరకు దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు శనివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పాతబస్తీలోని చిన్నచిన్న దేవాలయాలకు సైతం దేవాదాయ శాఖ నుంచి ఇస్తున్న ఆర్థిక సాయాన్ని మరో 10 శాతం ఎక్కువ పెంచాలన్నారు. అలాగే మహారాజ్ గంజ్ లోని పోచమ్మ ఆలయానికి గతేడాది ఇచ్చిన రూ.1,10,000 లను రూ.3 లక్షలకు పెంచాలని మంత్రిని కోరినట్లు ఆయన తెలిపారు.

ఆలయ పాలకమండలిలో బీసీలను నియమించాలి

చార్మినార్: ఆలయాల పాలక మండలిలో 42 శాతం బీసీలను నియమించాలని కోరుతూ బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు ఎ.రాజేశ్వర్ యాదవ్ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను శనివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇందుకు సంబంధించిన ఆదేశాలను జారీ చేయాలని మంత్రిని కోరినట్లు తెలిపారు.

ఉర్దూ మీడియం పాఠశాలలో.. అరకొర వసతులతో పరేషాన్!

- టీచర్లు, తరగతి గదుల కొరత
- 270 మందికి ముగ్గురు ఉపాధ్యాయులు, నాలుగు గదులు
- తరగతి గదులు సరిపోక వరండాలోనే చదువులు
- పట్టించుకోని విద్యాశాఖ అధికారులు

శాస్త్రిపురం: వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు ప్రారంభమయ్యాయి. అయితే పలు పాఠశాలల్లో మాత్రం సమస్యలు యథాతథంగానే ఉన్నాయి. గత విద్యా సంవత్సరంలోని సమస్యలే తమకు కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతుండటంపై విద్యార్థుల్లో ఒకింత నిరాశన కల్గిస్తోంది.

- ఇందుకు నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తోంది సులేమాన్ నగర్‌లోని ఉర్దూ మీడియం పాఠశాల. ఆ పాఠశాలలో విద్యార్థుల సంఖకు సరిపడా తరగతి గదులు లేవు. ఉపాధ్యాయుల కొరత షరామామూలే.
- 270కి పైగా విద్యార్థులు ఉన్న ఈ పాఠశాలలో నాలుగు గదులు మాత్రమే ఉన్నాయి. ఒకటో తరగతి నంచి 7వ తరగతి వరకు చదువుకునే అవకాశం ఉన్న ఈ పాఠశాలలో తరగతి గదుల సౌకర్యం మాత్రం లేదు. అంతమంది విద్యార్థులకు ముగ్గురు మాత్రమే ఉపాధ్యాయులు ఉన్నారు. స్కూల్ అసిస్టెంట్‌లు కూడా లేనందున విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులకు ఇబ్బందులు తప్పడం లేదు.
- పాఠశాలలో ఇంకా నలుగురు టీచర్లు, నాలుగు తరగతి గదులు అవసరం. ఈ విషయాలను ఎవరూ పట్టించుకోవడం లేదంటూ విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు.
- అరకొర వసతుల నేపథ్యంలో ఐదొందల మందికి పైగా విద్యార్థులన్న ఈ పాఠశాలలో ప్రతి సంవత్సరం విద్యార్థుల సంఖ్య తగ్గుతూ వస్తోంది. ఒకే గదిలో రెండు రెండు తరగతులను నిర్వహిస్తు,



సులేమాన్‌నగర్‌లోని ఉర్దూ మీడియం పాఠశాల



వరండాలో కూర్చున్న 1, 2వ తరగతుల విద్యార్థులు

మిగిలిన విద్యార్థులను వరండాలో కూర్చోపెట్టి చదివిస్తున్నామని ఉపాధ్యాయులు చెబుతున్నారు. వర్షం పడితే వరండాలో కూర్చునే వీలుండదని అందరినీ ఒకే చోట కూర్చోపెట్టి చదివిస్తున్నారని చిన్నారులు చెబుతున్నారు.

- పాఠశాల ప్రధానోపాధ్యానికి కూడా ప్రత్యేక గది లేదు. చిన్నారుల అవసరమైనా పుస్తకాలు, వస్తువులు పెట్టుకోవడానికి అవకావం లేదు. 5వ తరగతి పైన చదువుకునే విద్యార్థులకు సైన్స్ బోధించేందుకు ల్యాబ్ గదిని ఏర్పాటు కోసం రెండు సంవత్సరాల క్రితం ఏర్పాటు చేస్తాం అని అధికారులు చెప్పినా ఇప్పటి వరకు ఏర్పాటు కాలేదు. ఒకటి రెండు తరగతలను ఒకచోట, 4, 5వ తరగతుల విద్యార్థలను ఒక చోట కూర్చోపెట్టి చదివిస్తున్నామని పాఠశాల ఉపాధ్యాయులు చెబుతున్నారు.

పట్టని విద్యాశాఖ అధికారులు..

ఉర్దూ మీడియం పాఠశాలలో టీచర్లు, తరగతి గదుల కొరత ఉన్నా సంబంధిత విద్యాశాఖ అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. తరగతి గదుల నిర్మాణం కోసం పాఠశాల ఆవరణలో స్థలం ఉందని గదుల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

- చేసేదిమి లేక కొంత మంది తల్లితండ్రులు తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపుతుండగా మరి కొంత మంది ఇతర ప్రాంతాలలో ఉన్న ప్రభు త్వ పాఠశాలలకు పంపుతున్నారు. ఇకనైనా సంబ ంధిత ఉన్నతాధికారులు కల్పించుకొని ఉర్దూ మీడియం పాఠశాలలో టీచర్ల నియామకాలు చేపట్టి, అదనపు తరగతి గదుల నిర్మాణంతోపాటు మరిన్ని వసతులు కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

మైలార్‌దేవ్‌పల్లి: విద్యుత్ సంబంధ మరమ్మతు పనుల కారణంగా గగన్‌పహాడ్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ఫీడర్లల్లో ఆదివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు అధికారులు తెలిపారు. జై భవానీ, మీనాక్షి, సాతంరాయి ఇండస్ట్రీయల్, శివశక్తి ఫీడర్ల పరిధిలో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు సాతంరాయి, బీఎస్ఎన్ఎల్ టవర్స్ గల్లీ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు.

మెట్రో మాల్ ఫీడర్‌లో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.50 గంటల వరకు, పిలికాన్ రబ్బర్ ఫీడర్‌లో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు, ఐజీహెచ్ఎస్ ఫీడర్ లలో మధ్యాహ్నం 2.30 నుంచి 3 గంటల వరకు వెంకటేశ్వర కాలనీ, శ్రీరామ్ కాలనీ బుద్వేల్, పూజా గల్లీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని వారు వివరించారు.

శంషాబాద్ పరిధిలో...

శంషాబాద్ రూరల్: శంషాబాద్ ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మల కత్తిరింపు పనుల కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏడీఈ రమేష్ తెలిపారు. మండలంలోని 11 కేవీ గండిగూడ అగ్రికల్చర్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, 11 కేవీ ముచ్చింతల్ అగ్రికల్చర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. బుర్జుగడ్డతండా, మదన్‌పల్లి, గచ్చుబాయితండాలకు విద్యుత్ నిలిపివేస్తామని తెలిపారు.

కాటేదాన్ పరిధిలో...

మైలార్‌దేవ్‌పల్లి: కాటేదాన్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ఫీడర్ల పరిధిలో ఆదివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు అధికారులు తెలిపారు. కాటేదాన్ సబ్‌స్టేషన్-1 ఫీడర్: 1, 2, 3, 4, 5, 6, గంగోత్రి ఫీడర్‌ల పరిధిలో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు కాటేదాన్ ఇండస్ట్రీయల్ ఏరియా, సాయిబాబానగర్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు. కాటేదాన్ సబ్‌స్టేషన్-2 దుర్గామాత ఫీడర్, మురళీ హోటల్ ఫీడర్, సిటిజన్ కాంటా ఫీడర్, నేతాజీనగర్ ఫీడర్, శ్రీరామ్‌నగర్ ఫీడర్‌ల పరిధిలో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు కాటేదాన్ ఇండస్ట్రీయల్ ఏరియా, సమ్ పార్ట్ ఆఫ్ నేతాజీనగర్, సమ్ పార్ట్ ఆఫ్ శ్రీరామ్‌నగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని అధికారులు వివరించారు.

'వంద రోజుల ప్రణాళిక'లో మణికొండ మార్గదర్శకం

మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి



నూతన కార్యవర్గ సభ్యులతో సబితారెడ్డి, కార్తీక్‌రెడ్డి

మణికొండ: నిత్యం ప్రజల్లో ఉండి వారి సమస్యలు తెలుసుకోవటంతో పాటు వాటి సత్వర పరిష్కారానికి గుడ్ మార్నింగ్ మణికొండ పేరుతో వంద రోజుల పాటు కార్యక్రమాన్ని నిర్వహించిన మణికొండ నాయకులు రాష్ట్ర వ్యాప్తంగా మార్గదర్శకంగా నిలిచారని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి అన్నారు. శనివారం అలకాపూర్ టౌన్‌షిప్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన వంద రోజుల వేడుక సమావేశంలో ఆమె పార్టీ నియోజకవర్గ ఇంచార్జి పి.కార్తీక్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ... వంద రోజుల ప్రణాళిక పేరుతో ఓ వైపు మున్సిపాలిటీల్లో అధికారులు పనిచేస్తున్నా రోడ్ల పక్కన ఎక్కడ పడితే అక్కడ చెత్త కుప్పలు కనిపిస్తున్నాయన్నారు. ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న ప్రజలకు సరిపడా తాగునీటిని అందించేందుకు రూ. 1260 కోట్ల వ్యయంతో మిషన్ భగీరథ పనులు చేయించామన్నారు. అయినా మణికొండలో ప్రజలకు సరిపడా నీరు రావటం లేదంటే ప్రస్తుత ప్రభుత్వ పనితీరు అర్థం చేసుకోవచ్చన్నారు.

పార్టీ నాయకులకు పదవులు...

మణికొండ మున్సిపాలిటీ పరిధిలో బీఆర్ఎస్ పార్టీ పటిష్టతకు కృషి చేస్తున్న నాయకులను గుర్తించి వారికి కార్యవర్గంలో స్థానం కల్పించారు. అందులో పార్టీ సలహాదారుడు, అధికార ప్రతినిధిగా బి.ఉపేంద్రనాథ్‌రెడ్డి, ఆర్గనైజింగ్, పబ్లిసిటీ విభాగం ఉపాధ్యక్షుడిగా ఎ.లక్ష్మణ్‌రావు, ఎస్సీ, బీసీసెల్ ఉపాధ్యక్షుడిగా ఎ.శ్రీకాంత్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎస్.రామసుబ్బారెడ్డి, సెక్రటరీగా ఖలీం, మైనార్టీ సెక్రటరీగా షేక్ ఆరీఫ్, కార్యదర్శిగా అశోక్, యూత్ వింగ్ అధ్యక్షుడిగా ఎస్.శ్రీకాంత్, బీసీ సెల్ అధ్యక్షుడిగా బి.బాబు, బీసీ సెల్ ప్రధాన కార్యదర్శిగా బి. మల్లేష్, ఉపాధ్యక్షుడిగా శ్రీశైలం, ఐటీ సెల్ అధ్యక్షుడిగా శ్రీనాథ్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా మోహనకృష్ణ, ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శిగా బాబురావు, ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడిగా జి.విఠల్, స్పోర్ట్స్, కల్చరల్ అధ్యక్షుడిగా భానుచందర్, మైనార్టీ, క్రిస్టియన్ వింగ్ అధ్యక్షుడిగా జైరాం, సోషల్ మీడియా అధ్యక్షుడిగా మహ్మద్ షేక్ ఆరీఫ్, ప్రధాన కార్యదర్శిగా సుమ నళినిలను నియమించారు. మహిళా విభాగంలో ప్రధాన కార్యదర్శిగా కె.విజయలక్ష్మి, ఉపాధ్యక్షులుగా కృష్ణ రాజి, సురేఖగౌడ్, అనూష, జి. విజయలక్ష్మి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా రాణి, సెక్రటరీలుగా ఎస్.మంజుల, జి.రాజేశ్వరి, పద్మ, అంజలి, శాంలెట్ రేఖ, కోశాధికారిగా ఎ.అనూషలను నియమించారు.

పటిష్టంగా పార్టీ కేడర్...

రాజేంద్రనగర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ నుంచి గెలిచిన ఎమ్మెల్యే పార్టీ మారినా పార్టీ కేడర్, ప్రజలు పార్టీకి బాసటగానే ఉన్నారని, వారంతా సమయం వచ్చినపుడు గుణపాఠం చెపుతారని ఆ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి పి. కార్తీక్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్‌ను రాబోయే రోజుల్లో కాలనీలు, అపార్ట్‌మెంట్‌ల వారీగా బలోపేతం చేయాలన్నారు. పార్టీ అధ్యక్షుడు డి.సీతారాం, ప్రధాన కార్యదర్శి జి.నరేందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కె.ధన్‌రాజ్, నార్సింగి మున్సిపాలిటీ అధ్యక్షుడు కె.విష్ణువర్ధన్‌రెడ్డిలతో పాటు పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సర్కారు బడులను కాపాడుకోవాలి: టీఎస్‌యూటీఎఫ్



బాల్‌రాజ్

శంషాబాద్ రూరల్: విద్యార్థులు ప్రైవేటు పాఠశాలలకు కాకుండా సర్కారు బడుల్లో చేరేలా చొరవ తీసుకోకుండా.. సమీపంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను తీసుకెళ్లి ముచ్చింతల్‌లో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో చేర్పించడం సరైన పద్ధతి కాదని టీఎస్‌యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు డి.బాల్‌రాజ్ అన్నారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ప్రకటన చేశారు. మండలంలోని ముచ్చింతల్‌లో ఉన్న ప్రభుత్వ పాఠశాలకు సమీపంలో ప్రభుత్వ బడుల్లో నుంచి విద్యార్థులు తీసుకెళ్లి చేర్పించడంతో.. ఆయా బడుల్లో విద్యార్థుల సంఖ్య లేక మూతబడే అవకాశం ఉందన్నారు. ఇలా జరిగితే ఉపాధ్యాయులను వేరే చోటకు డిప్యూటేషన్‌కు వెళ్లే పరిస్థితి నెలకొంటుందన్నారు. గచ్చబాయితండాలోని విద్యార్థులంతా వెళ్లిపోయారని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల నుంచి ముచ్చింతల్ పాఠశాలకు వచ్చిన విద్యార్థులను తిరిగి పంపించాలని డిమాండ్ చేశారు. ఏ ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో ఆ ప్రాంత విద్యార్థులను చేర్పించేలా చర్యలు తీసుకొని ఆయా పాఠశాలలను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనం ఉదన్నారు. ఈ మేరకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

అలరించిన కూచిపూడి విభావరి



మాదాపూర్: శిల్పారామంలో నిర్వహించే వారాంతపు కార్యక్రమాలలో భాగంగా శనివారం సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత కూచిపూడి నాట్యగురువు మద్దాలి ఉష గాయత్రి శిష్యబృందంచే కూచిపూడి విభావరి ఆకట్టుకుంది. ఇందులో శివదీక్ష, ప్రహ్లాద పట్టాభిషేకం, బాల కనకమయ, చక్కనితల్లికి, శ్రీకృష్ణ జనన శబ్దం, అలరులు కురియగా, గొల్లకలాపం, తిల్లాన తదితర అంశాలను కళాకారు లు వాసవిచౌదరి, ఆశ్రితషిండే, యశస్వినీ, శ్రద్ధ వారణాసి, సహస్ర చరిష్య తదితరులు ప్రదర్శించారు.

అన్నమయ్యపురంలో..

అన్నమయ్యపురంలో నిర్వహించే అన్నమయ్య స్వరార్చనలో భాగంగా భాస్కర్ డ్యాన్స్ అకాడమీ డి.సాత్విక శిష్యబృందం కూచిపూడి నృత్యప్రదర్శనతో అలరించారు. ఇందులో కుంభహారతి, అలరిపు, గణపతి తాళం, ముద్దుగారే యశోద, శివకై వరం తదితర అంశాలను కళాకారులు హాస్నవి, శ్రీశ్విత, హర్షిత, లక్ష్మి ప్రణతి, మనస్వి, వైష్ణవి, శ్రీహిత, బాలభవ్యశ్రీ, సహస్ర ధరణిత, ప్రజ్ఞ, సౌగంధిక, శరణ్య, తనుశ్రీ నవ్య, ఆరాధ్య, శ్రీవల్లి , పర్ణిక, శంకరి, హాసిని ప్రదర్శించారు.

హెచ్‌సీయూలో క్లీనప్ డ్రైవ్

రాయదుర్గం: హెచ్‌సీయూ క్యాంపస్‌లో ఎన్ఎస్ఎస్ విభాగం సమన్వయకర్త డాక్టర్ కృష్ణయ్య, ప్రోగ్రామ్ ఆఫీసర్ ప్రొఫెసర్ భీమ్‌సింగ్ ఆధ్వర్యంలో శనివారం క్లీనప్ డ్రైవ్ నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, సత్కర్మ వాలంటీర్లు, సౌత్ షాపింగ్ కాంప్లెక్స్, స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్ ప్రాంగణంను శుభ్రం చేశారు. ప్లాస్టిక్ బాటిల్స్, సంచులు, గాజు సీసాలు, చెట్ల కొమ్మలు ,చెత్తాచెదారం తొలగించారు. వీటిని ట్రాక్టర్‌లో డంపింగ్ యార్డ్‌కు తరలించారు.

రాజేంద్రనగర్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతా

- అన్నివిధాలా అభివృద్ధి చేస్తున్నాం
- ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

బండ్లగూడ: రాజేంద్రనగర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ అన్నారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 8, 9, 10, 11వ డివిజన్‌లలో అభివృద్ధి పనులకు శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. మొత్తం రూ. 6.93 కోట్ల వ్యయంతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, రోడ్ల వైడనింగ్ పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... సంక్షేమం, అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తున్నదన్నారు.

- నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శవంతమైన, అగ్రగామి నియోజకవర్గంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్ల నిర్మాణంతో పాటు వసతుల కల్పనకు పెద్దపీట వేస్తామని, సీసీ రోడ్లతో పాటు అభివృద్ధి పనులను నాణ్యతతో చేపట్టాలని అధికారులను ఆదేశించారు.
- కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు, కాలనీ వాసులు, కాలనీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో యాదాద్రి కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్‌ను వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కోరారు. ఈ మేరకు ఆయనకు వినతిపత్రం సమర్పించారు. కాలనీలో అంతర్గత రోడ్లు, నీటి సరఫరా, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వంటి మౌలిక వసతుల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరారు. రోడ్లు లేక కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా కొత్త అదనపు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలన్నారు. మంచినీటి సరఫరా సరిగా జరగడం లేదన్నారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.
- యాదాద్రి కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మధుకర్, నేతలు రఘుగౌడ్, సంపత్‌గౌడ్, బుడియానాయక్, నరేందర్‌రెడ్డి, మహేష్, శ్యామ్ లాల్, రాజేష్, కిష్టప్ప, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా దేవాలయాల వార్షికోత్సవం



వార్షికోత్సవ పూజలో పాల్గొన్న మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ తదితరులు

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ కేంద్రంలోని గండమ్మ, పోచమ్మ దేవాలయాల ద్వితీయ వార్షికోత్సవ పూజలను శనివారం ఘనంగా నిర్వహించారు. దేవాలయాలను అందంగా అలంకరించి ఉదయం నుంచి గణపతి పూజ, అభిషేకాలు, అర్చనలు, చండీహోమం నిర్వహించారు. గ్రామ దేవతలు గ్రామస్థులందరినీ చల్లగా చూడాలని వేడుకున్నారు. పూజా కార్యక్రమాల్లో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ జి.వెంకటేశ్‌యాదవ్, మాజీ కౌన్సిలర్ అరుణజ్యోతి దంపతులు పాల్గొన్నారు. మధ్యాహ్నం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.